# వర్ణాంతరవివాహం

శ్రీ బలివాడ కాంతారావు

జగన్నాథం పెద్దకూతురు దొంగతనంగా తక్కువ జాతివాణ్ణి పెళ్ళి చేసుకుందట!

మధ్యాన్నం పన్నెండు గంటలకే ఊర్లో యీ వార్త వ్యాపించేసింది. "ఈ వేళ ప్రొద్దున్నే ఆఫీసుకు తలవంచుకొని వెళ్లి పోతుంటే చూశాంగా! నమ్మతగ్గ కబురు కాదన్నారు." ఆమెను వుదయం యెనిమిది గంటలకు చూసినవాళ్ళు!

"లేదు! ఆఫీసుకని యింట్లో బయలుదేర టాక్సీయెక్కి సరాసరి ప్రక్కవూరి దేవాలయం దగ్గర దిగిందట! అంతా సిద్ధంగావుంది. మూడు ముళ్లూ పడిపోయాయ్!" విషయం కనుక్కున్న వాళ్లి వాదనయిది.

ఇలా అవునూ కాదన్న వాదనలు సాయంత్రం సరికి చల్లబడిపోయాయ్. పెళ్లికూతురు అప్పుడే తన కాపరం అది చేసుకోవటం యెందరో చూశారు కాబట్టి!

ఇది చాలా చోట్ల చర్చనీయాంశం అయింది!

"పోనిద్దూ! ఆడపిల్లకు చదువేవిటి? అధికార మేవిటి? అంత స్వతంత్రం యిస్తే యేమైనా చేస్తారు!"

"ఇంత అజగన్నాథానికి తెలీదంటావా?"

"తెలిస్తే కట్టుబాట్లు చెయ్యకపోనూ—!"

"తెలుసురా అబ్బాయి తెలుసు! కొద్దిగా పసిగట్టి ఆ యిద్దరు పనిచేస్తున్న ఆఫీసు పెద్ద దగ్గరకు వెళ్ళి గోలపెట్టాడట!"

"నిజం!?"

"హాఁ" ఆ ఆఫీసులో మా మేనల్లుడు ప్యూనో కదోయ్! అంతా పక్కగదిలోనించి విన్నాడుగా— ఆ ఆఫీసరు యేమన్నాడంటే—కులం సాంప్రదాయాల విషయంలో నీకున్న అభిప్రాయాలతో నేను యేకీభవించలేనన్నాడట!"

"ఆహా! కాలాతీతుడులా వున్నాడే!"

"అంతేకాదు నా ఆఫీసులో నాక్కావలసింది పని, నడవడిక! ఇద్దరూ బాగాపని చేసుకుంటున్నారు.. సవ్యంగా మెసులుతున్నారు. వాళ్లిద్దరూ డొంక తిరుగుళ్లు తిరగకుండా పెళ్లి చేసుకొని సుఖంగావుంటే నాకు సంతోషమే అన్నాడట!"

"అంతవరకు యెప్పుడు వచ్చిందో వుద్యోగం వెంటనే మాన్పించి వంటయిల్లు కదలనివ్వకుండా చెయ్యవలసింది! పాపం జగన్నాథం వుత్తి అమాయకుడు!"

"కూతుర్ని కొట్టిస్తే అబ్బే వాడితో నాకేం పని అందట! వాణ్ణి పెళ్లిచేసుకోనని ప్రమాణంకూడా చేసిందట!"

"నమ్మాడూ?"

"నమ్మక యేం చేస్తాడోయ్—అదంటే పంచ ప్రాణాలే వాడికి—ఇంతకీ ఆ ఆఫీసరు ఏం చెప్పాడో పూర్తిగా విను..."

"వాడివరకూ రాలేదుగా—యేమైనా..."

"పొరపడుతున్నావ్. వాడు చాలా చండశాసనుడట! వాడిచెల్లెలూ యెవరినో కట్టుకుంటా నంటే తల్లి దండ్రి కాదంటే తనే స్వయంగా పెళ్లి చేశాడట!

జగన్నాథం ఖస్సుమంటే నీవన్నీ త్రేతాయుగంనాటి కబుర్లు—నెహ్రూ, రాజాజీలకంటే నీవు తెలివైనవాడివా" అని అడిగాడట!

"వాడే ప్రోత్సాహంచేసి వుంటాడులే, లేకపోతే పిల్లకా ధైర్యం యెక్కడిదీ? అయినా అంత తక్కువ కులంవాడిని కట్టుకోవటం కమలకు భావ్యం కాదుసుమా!"

"ప్రేమ గ్రుడ్డిదిరా అబ్బాయ్..."

"ఇలాంటి వన్ని జరగలేదు. తెగిపోలేదు ఏటొచ్చీ ఆ ముసలాణ్ణి అందరి ఆడపిల్లలతో ను

గంగలో త్రోసినట్లు చేసింది! దాని సౌఖ్యం చూసుకుంది గానీ యీ కుటుంబం సర్వనాశనం చేస్తున్నా ననైనా ఆలోచించిందా? పాపం! ఆ ముసలాడు పిచ్చివాడిలా వున్నాడులే! మూడురోజుల్నుంచి తిండీ తిప్పలూ లేవట! కళ్లంట రక్తం కారుస్తున్నాడు! చూశాను—చాలా జాలి వేసింది!"

"నేను జగన్నాథం గురించి విచారించలేదోయ్! కమల గురించే!"

"దానికేం? ఇద్దరి ఆర్జన—హాయిగా వుంటారు! వాడూ డబ్బుకు ఆశపడే దీన్ని చేసుకున్నాడులే!"

"ఈ క్రొత్తిరబ్బసం యెంతకాలం వుంటుందీ? ఏదో పేచీ యెక్కడో - వస్తే ఆఫీసులోనే! రావచ్చు దాని యిష్టానుసారం తిరగనిస్తాడనా? ఖర్చు పెట్టనిస్తాడనా? అప్పుడు రెండు వేపులా చెడుతుంది!"

ఇలా రకరకాల చర్చలు కొనసాగి చివరకు ఆ పదిహేను రోజుల్లోనే వూర్లో పుకారు బయలుదేరింది! వాళ్ళిద్దరూ యెప్పుడూ దెబ్బలాడుకుంటూ వుంటారని! ఏవో కేకలు వేసుకోవటం స్వయంగా మేం విన్నాం అన్నారు కొందరు! ఇద్దరూ ఆఫీసుకు వెళ్తారే గాని యెడముఖం పెడముఖంగా వుంది—మీ రెవరూ గమనించలేదూ? అసలు చెయ్యికూడా మొన్న రాత్రి చేసుకున్నాడటలే!

ఆ ముసలాడి వుసురు తగలదా మరి అన్నారు కొందరు. రామ రామ పీనుగైపోయాడే—కడుపాకలి—గుండెమంట! చుట్టాలు పరామర్శకు వచ్చినట్లు వచ్చి నాలుగు వడ్డిస్తున్నారు. చూడటానికి వచ్చిన వాళ్ళు ఆ క్రొత్త దంపతులలో ఏ.వ దుమారం వర్ణిస్తూ చూసినట్లే చెప్పుకొస్తున్నారు—జగన్నాథం మనసు తన స్వాధీనంనుంచి యే నిముషంలో తప్పుకు పోతుందో!

ఇలా వుంటుండగా పోస్టుమేన్ తలుపు తట్టాడు. నూరు రూపాయలు మణియార్డరు—ఇంట్లో వుండే టప్పుడు జీతం అందుకున్నవాడు తండ్రి చేతికి అంతే యిచ్చేది!

ఆ మణియార్డరు ఫారము చేత పెట్టగానే జగన్నాథం మెల్లగా "నూరు రూపాయలు" అన్నాడు. వినువెంటనే క్రోధంతో "నూరు రూపాయలు!" అని పెద్ద కేక వేసాడు. ఇద్దరు కూతుర్లూ పెరటినుంచి పరుగెత్తుకొచ్చారు.

"అది నా కూతురా? నన్ను తిన్న బ్రహ్మ రాక్షసి! నన్ను ద్రోహం చేసింది...ఛో ఛో ఆ పాపిష్ఠి దాని ఆర్జన నాకొద్దు"

ఆ ఫారం విసరికొట్టూ కూతుర్ల వేపు తిరిగి "ఏదమ్మా నే నేం లోటు చేసాను? నా ప్రయత్నాలలో నేను లేనా? ఏమూల చూసినా నాగురించే? నా పరువు మర్యాదలూ తీసి నన్ను గొయ్యిలో పాతిందమ్మో..." వెంటనే వలవల యేడ్చేస్తూ "పదండి! ముగ్గురం పోయి ఏ నుయ్యో గొయ్యో చూసుకుందాం!

అలా క్రిందను కూలబడిపోయాడు. మూర్ఛ పొందినట్లయిపోయాడు జగన్నాథం! తెలివి వచ్చాక కలం తీశాడు. "ఓ పాతకీ! రాక్షసీ! పిశాచీ!

నీవు విద్యల సరస్వతి వనుకున్నాను. వీణా పాణిని చేశాను. అది చచ్చిపోయాక మిమ్మల్ని నమ్ముకొని బ్రతికాను. నానా చాకిరీ చేసైనా మిమ్మల్నొ యింటివాళ్ళని చేస్తానని నోరు కట్టాను, పరువు నిలుపుకున్నాను. నా ఆశలన్నీ గంగలో కలిపావే! నన్ను వెనుకనుంచి బాకుతో పొడిచావే! నన్ను నమ్మించి ద్రోహం చేశావే! నన్ను చేసినట్లే వాడినీ యెప్పుడో ద్రోహం చేస్తావ్? చివరకు బజారులోపడి నాశనమయిపోతావ్..."

"అమ్మా వెళ్లు—యిప్పుడే—వెళ్ళి యీ వుత్తరం డొక్కులో వేసీ!" కోపంతో వణికిపోతున్నాడు... రెండో కూతురు వేస్తోందో లేదో అని డాబా యెక్కి మన్యలో నిల్చొని చూస్తున్నాడు. ఆమె వెయ్యటం చూసాక కొస్త మనసు తృప్తిపడింది. క్రిందికి దిగి మంచంమీద వ్రాలిపోయాడు. దుఃఖం ముంచుకొస్తోంది. గట్టిగా యేడవాలనుకున్నాడు. కానీ కళ్ళల్లో నీరు తిరుగుతున్న యిద్దరి కూతుర్ల వేపు చూసాడు. వాళ్ల ముఖాల్లో నెత్తురు చుక్కలు లేవు. వాళ్ల వేపు చూస్తుంటే కడుపు మరీ దహించుకపోతోంది! "దాని సౌఖ్యం అది చూసుకుంది? వీళ్ల గతేంగానూ? ఈ మన్ను అది చచ్చేవరకూ వుంటుంది! వీళ్ళనెలా ఒక యింటి వాళ్ళనిచేస్తాను? అప్పుడే యెందరో వేళ్ళు చూపిస్తూన్నారే? కట్నాలకి డబ్బు లేక యిన్నాళ్ళూ కుమిలిపోతే యిప్పుడు యింటి గుమ్మం యెవరు త్రొక్కుతారు! డబ్బు కొల్లలుగా చల్లడానికి నాకెక్కడిదీ? అయ్యో పిచ్చివాడే యీ జగన్నాథం! వీళ్ల పెళ్ళిళ్ల గురించా ఆలోచిస్తున్నాడు? ఈ యేభై

రూపాయల పించనీతో వీళ్ళకి కడుపునిండా తిండీ, ఒంటికి బట్టయినా యివ్వగలడా? వీళ్ల చదువులు సంగతీసరి! ఎందుకురా యిలాంటి హీనమైన పుటక పుట్టావ్. ఒరే జగన్నాధం—చచ్చిపోరా...యీ గొడవంతా తగ్గి హాయిగా వెళ్ళిపోతావ్?"

ఇలా తననితనే దూషించుకున్నాడు. చచ్చిపోదామనుకున్నాడు. మళ్లీ కూతుర్లుగతేం అవుతుందని ఆలోచనలో పడ్డాడు. తను చచ్చిపోతే వాళ్లను చేరదీసే వాళ్లెవరూవుండరు. ఆకలితో చచ్చిపోలేరు. వాళ్లికున్నదంతా ఒక్కటే—యౌవ్వనం! అది కడుపు కోసం నానా దుర్మార్గులకు అమ్ముకోవాలి! లోకం అంతా వేలెత్తి చూపిస్తుంది—ఫలానా సంప్రదాయ కుటుంబీకుడు జగన్నాధం కూతుర్లు వీళ్ళు! వాడు వురిపోసుక చచ్చాడు! కానీ వీళ్లని బజారులో విడిచిపెట్టాడు. అప్పటి పరిస్థితులు వూహించగా ఒళ్లంతా కంపించసాగింది. ఇంతకంటే మరీ అధ్వాన్నం! చచ్చిపోను బాబో అనుకున్నాడు. వీళ్ల కోసమైనా నేను బ్రతికుండాలి...తప్పదు... తప్పదనుకున్నాడు.

తను వ్రాసిన వుత్తరానికి కూతురు దగ్గరనుంచి జబాబు వచ్చింది:

"మహారాజశ్రీ నాన్నగార్కి నమస్కారములు:—

మీ ఉత్తరం చేరింది. మీబాధ అర్థం చేసుకున్నాను. సానుభూతి చూపించటం తప్పించి యింకేం చెయ్యగలను? లోకంలో యే తండ్రీ యే కూతురినీ పెంచనంత గారాబంతో పెంచారు. మీమాట ప్రతీ చిన్న విషయంలోనూ విన్నానుకానీ యీ ఒక్క విషయంలో నే స్వతంత్రించినందుకు క్షమించండి!.

నా సాహసానికి యీవూర్లో నే కాదు, పొన్నూర్లలోవున్న గంపెడు చుట్టాలు దాడి జరుపుతున్నారు. మీకు చాలా తలవంపు తెచ్చేమాటలు విసుర్తున్నారు. కానీ నా పరిస్థితి కొంత చెప్పుకోనీయండి:—

మీకు తెలియక పోవచ్చు—ఉద్యోగంలో చేరిన దగ్గరనుంచి సరిగ్గా నడిచినా—ఎవరితో మాటాడినా - చిన్న నవ్వునవ్వినా - నే నేంచేసినా యేదో అపాయం అయ్యింది - అపవాదులు లేచిపోయాయ్. అందరి నోటిలో నేనొక పతితనయ్యాను. ఇలాంటి పరిస్థితులలో మీరు కలలుగన్న అల్లుణ్ని మీరు సంపాదించటం దుర్లభం—దొరికినా అనుమానాలతో నా జీవితాన్ని నాశనంచేస్తాడు. ఈయన నా అసహాయ పరిస్థితిని గ్రహించారు. లోకంఅంతా చూపించని చివరకు నా తోబుట్టువులు కూడా చూపించని సానుభూతి చూపించారు. ప్రవాహంలో కొట్టుకపోతున్న దానిని తన బంధువర్గం కాదన్నా సాహసించి ఒడ్డుకుతీశారు. అలాంటి నిర్మలుడు, నిజాయితీపరుడు, నే నెలా మోసంచేస్తాను? నేనూ మా అమ్మలాంటి ఆడపుట్టుక పుట్టాను. పాతికేళ్లు నిండినా మా అమ్మలా బాధ్యత తీసుకోకండా యెన్నాళ్లు వూరుకుంటాను? ఇది సాహసమనండీ యేమనండీ మీకు తప్పనితోస్తే క్షమించండి! కులంలో యేం వుంది. గుణంలో వుందిగానీ? ...- వారు చెప్పినట్లు మీ డబ్బు బ్యాంకులో వేస్తున్నా....

మీ అమ్మాయి—

జగన్నాధం "కులం యేవుంద"ని పళ్లు పటపట కొరికి వుత్తరం విసరికొట్టాడు. మళ్లా తలకొట్టుకుంటూ "ఎంతయెత్తునుంచి దిగజారి పోయాం దీన్నుంచి...!"

ఆవారం రోజుల్లో నే బ్రతుకుభారం అనిపించింది.

ఒక నెలరోజులకే బాగా చిక్కిపోయాడు. ఒకపూట కాఫీ మానేశాడు. ఇంకోపూట భోజనంకూడా సరిగ్గాలేదు. అయినా చిల్లర అప్పులవాళ్లు పీక్కుతింటున్నారు. బయటకు ముఖంచూపించడానికి సిగ్గువేస్తోంది! బయటకు వెళ్లినా తనేం ఆర్జించగలడు? రిటయరయ్యే సమయానికి కూతురు చెయ్యి కలిసొచ్చిందని వుబ్బి తబ్బిబ్బయ్యేడే — అలాంటిది యింతలో యింత ఘోరం చేస్తుందని తను కలలోనైనా అనుకోలేదు! పరధ్యానంగా వుండేటప్పుడు యిలా బాధపడే బదులు కూతురు దాచిన డబ్బు తలుపుకువచ్చేది. చప్పున మెలుకువవచ్చినట్లయ్యేది? - అదా? పాతకి - దానిముఖం చూస్తానా యీ జన్మలో... ఇలా కష్టాలుపడి ఆకలితో చిక్కి చచ్చిపోతానుగానీ ... ఒకడికి యెదురుగా చెయ్యిచాపను ... ఈ జగన్నాధం యెంత బ్రతుకు బ్రతికాడు! కానీ దినమొక యుగంలావుంది- దిక్కుమాలిన బ్రతుకైపోయిందే. అన్ని వేపులా బాధే. —ఇలా తనెందుకు అప్పులవాళ్లచే అనిపించుకోని

శంఘుంచే వేళ్లు చూపించుకొని బ్రతికాలి? ఎవరో అనుకుంటున్నారు, నామతి చలించిందని! నిజంగా చలించిందా? ఏమో?

ఇలా జీవితంమీద రోతపుట్టే సమయంలో ఒక ముసలమ్మ — దగ్గరిచుట్టమే పరామర్శించుకొని వస్తూనే "ఒరే జగన్నాథం — విన్నావటరా నీ పెద్దకూతురు సంగతి!"

"అది నాకూతురా — నాకూతురు ఆనాడే పోయిందిలే?"

"కాదురా! వాడు మాంసం తెచ్చి వండమన్నాడట! కమలసంగతి మనకు తెలీదు — అలాంటివాటికి ఆమడదూరంలో వుండేది. వండనంటే పాపిష్ఠివాడు ఎముకలు విరగొట్టాడట! అవును మరి — విధి చెడి యీటివాడితో లేచిపోతే చచ్చేవరకూ డోలు వాయించమనడూ? దానిగతి అలాగేవచ్చింది! పాపం!!

రెండోకూతురు కలుగజేసుకొని "అక్క వెళ్లాక లేశు అలాంటివి తినటం మానేశాడట!"

జగన్నాథం కూతురుమీద ఖస్సుమన్నాడు. "దాని వూసుయెత్తారంటే యెట్లో పారిపోతాను..." ముసలమ్మ ఓదార్పు మాటలతో "అలాగంటే యెలాగరా! ఒక తుంబలో విత్తనం — ఐనా ఆకమలనెందుకంటావ్?"

"దాన్ని అనక పై అమ్మకోడుకు వాడినెందుకంటానే దీనికి సాహసం లేకపోతే..."

"ఓరే జగగన్నాథం యింకా నీకు చిన్నబుద్ధి పోలేదురా! ఎంతవందనంగావుండేది పిల్ల! మాయా మర్మంలేని తల్లి! మీ వంశంలో లేని అందచందాలున్న పిల్ల! ఎంతకమ్మగా పాడేది! అదంటే నీకు పంచప్రాణాలే—ఎంత ఆలోచనలేని మనిషివయ్యావే!"

జగన్నాథం మనసులో కూతురి యీ మంచి గుణాలన్నీ ఒక్కసారి గిరగిరా తిరిగిపోయాయి. "ఈమె చెప్పేదానిలో అసత్యం యేమీ లేదు...... కానీ...అది నాకు నమ్మించి ద్రోహంచేసింది...... నన్ను ఖూనీచేసింది!" అనుకున్నాడు.

"అవునురా జగన్నాథం వాడేదో మోసం చెయ్యకపోతే...యీ పుత్తడిబొమ్మకి అంత సాహసంయేదీ? ఒకరోజు యిద్దరూ పోతుంటే కమలను పిల్చి మరీ వాణ్ణి చూశాను...పోనీ ఆఫీసరా? దీనికంటె హెచ్చుచదువుకున్నాడా? అందగాడనా? ఏమీ లేదు—ఇందులో యేదో ప్రయోగం లేకపోతే యిలా జరుగుతుందని అనుకోను—యేమంటావ్? ఇప్పుడా దాని బతుక్కు, అన్నీ కట్టుబాట్లే—చివాట్లూ చీదరింపులూనూ? ఒక్కనాడూ పల్లెత్తిమాటాడావా? ఏంఖర్మవచ్చింది దానికి?"

జగన్నాథం మారుమాటాడలేదు. ఆమె వెళ్లిపోయినా ఆ వేమాటలు మనసులో పెనవేసుకుంటున్నాయ్. ఎంత ప్రయత్నించినా ఆమె అన్నమాటలు మళ్ళీ మళ్ళీ మనసులో దొర్లుకపోతున్నాయ్. చీకటి పడినా మనసు మహాసముద్రమైపోతోంది. అల్లునిమీద అంతర్గతంలోవున్న ద్వేషం రగులొక్కంది. అన్నం సహించలేదు. నిద్దరపట్టడంలేదు. ఒక్కసారి దుఃఖం పెల్లుబికింది "యెంతబాధపడుతోందో?—ఇందులో యేదో మోసం లేకపోతే నాతల్లి యింత సాహసానికి ఒడిగట్టకోదు! నాచేతులతో పెంచానే దానిమంచి నాకా తెలీదు?... నేను బ్రతికున్నానా? అసలు జగన్నాథం ఏనాడో చచ్చిపోయాడు......లేకపోతే యిన్నాళ్ళూ దానిముఖం చూడకుండా యెలాగ బ్రతికాడు? నాతల్లిని యిలా వూరూ పేరూ లేనికడజాతివాడు కొట్టుక్కుతింటుంటే వింటూ వూరుకుంటున్నానా? "వలవల యేడ్చేశాడు. ఇప్పుడు అల్లుడు నల్లగా, కోరలతో రాక్షసుడిలా కనిపించాడు." అయినా నేను అల్లారు ముద్దుగా పెంచిన నా కూతురిమీద చెయ్యివేయటానికి వీడికేం హక్కుంది? అసలు నా కూతుర్ని తాకడానికి వీడికేం విలువుంది? ఇలా దాని జీవితకాలం అవస్థలు పడవలసిందేనా? ఒక్కసారి తప్పుచేసిందని...అబ్బే నా కూతురు తప్పు చెయ్యలేదే—దాన్ని మందులు మాకులతో లోబరచుకున్నాడు—వీడి బంధంనించి విడిపించుకోలేదే..."

"ఒరే జగన్నాథం—నువ్విలాగా చిక్కిశల్యం అయిపోయావ్? ఇంకెంతకాలమూ బ్రతకవ్...ఈ కొద్దికాలం బ్రతికి బాధపడటం తప్పించి ఇంకెవర్ని వుద్ధరిస్తావ్? నీ బంగారు తల్లికి బంధవిముక్తి చెయ్. యిదే నువ్వామెకు చేసిన మహోపకారం! లే...లే... యింకా ఆలోచిస్తావా? లే...లే..."

మనసులో మంటలు లేచాయ్. జగన్నాథం లేచాడు. తువ్వాలుతో ముసుగు వేసుకున్నాడు. మెల్లగా తలుపులు తీశాడు. రోడ్డంతా నిర్జనంగా వుంది. పౌరుషం సింహబలాన్ని తెప్పించింది. దిగువ పెద్ద అంగలు వేసుకుంటూ నడిచాడు. తను రక్షించడానికి ఉద్రిక్తుడై వురుకుతున్నట్లు తలుపు దడదడ తట్టాడు. తలుపు తీసిన అల్లుడు సంతోషంతో

"మీరా! రండి!" అన్నాడు.

"నాన్నా..." అని కూతురు ఒక్క గంతు వేసింది.

మౌనంగా తలుపుగడియ వేసి అల్లుని వేపు పదునైన కత్తి చూపిస్తూ "నాతల్లిని కాదు నిన్ను చంపడానికి ఆగు ఆగు!"

అల్లుడు ముందుకొద్దిగా జంకినా అతని ముఖం వేపు చూస్తూ ఒక్కసారి మొండి ధైర్యంతో "సరే! చంపండి" అంటూ ముందుకు వస్తుంటే కూతురు కెవ్వుమంటూ కేక వేసి తండ్రి కాళ్లమీద పడిపోయింది. ఆ రొప్పరగావున్న ప్రశాంతమైన రెండు కళ్ళూ అతని హృదయంలోనికి చూచి గిలిగింతలు పెట్టించాయ్. ఆ గంభీరత అతని చెయ్యిని గజగజలాడించింది. తడబడుతూ "చంపమంటున్నావ్... నీకు... నీకు... భయం లేదూ?"

"లేదు..."

నిల్చున్న కళ్లు రెప్పలు పడలేదు. అలా ముఖం వేపుచూస్తూనే కత్తి క్రింద పడవేశాడు. కూతురు చప్పున లేస్తూ "మానాన్న మా మంచినాన్న" ఆమెను పట్టుకొని వెక్కివెక్కి యేడవసాగాడు. కూతురు యేడుస్తుంటే కళ్ళు తుడుస్తూ.

"ఖూనీకోరునమ్మా...... నేనే తక్కువ జాతి వాణ్ణి...చాలా అదృష్టవంతురాలివి!"

హాయిగా,
స్వేచ్ఛగా త్రొక్కడానికి
అనువైన సైకిల్

రాలె
రాబిన్‌హుడ్

సెన్-రాలె బైసికల్ ప్రతివక్కటీ శ్రేష్టమైన ముడిపదార్థాలను అత్యధునాతమైన సాంకేతిక పద్ధతులద్వారా ఉపయోగించి, ప్రతి విభాగాన్ని ప్రత్యేకంగా పరీక్షించి తయారుజేయబడినది. అందువల్ల వాడకానికి ఏమీ ఖర్చుపెట్టకుండానే, స్వేచ్ఛగా, ఇష్టం వచ్చినట్టు సైకిల్‌ను వాడుకొనవచ్చు.




సెన్-రాలె